క్లుప్తంగా

సంక్రాంతికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు

రామచంద్రపురం రూరల్: సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఏపీఎస్ ఆర్టీసీ రామచంద్రపురం డిపో నుంచి వివిధ ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కొడమంచిలి వెంకటేశ్వర్లు సోమవారం విలేకరులకు తెలిపారు. పండగ ప్రత్యేక సర్వీసులకు ఎటువంటి అదనపు చార్జీలు ఉండవన్నారు. ఈ నెల 11వ తేదీన హైదరాబాదు, ఇచ్ఛాపురం తదితర ప్రాంతాల నుంచి పండగకు రామచంద్రపురం వైపుకు వచ్చే వారి కోసం, ఈ నెల 17 నుంచి రామచంద్రపురం నుంచి హైదరాబాదు, ఇచ్ఛాపురం తదితర ప్రాంతాలకు వెళ్లేవారి కోసం ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నామన్నారు. ప్రయాణికులు ఆర్టీసీ అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అండగా వైఎస్సార్ బీమా



వైఎస్సార్ బీమా సొమ్మును అందజేస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం: నిరుపేదల ఇంట్లో మరణం సంభవిస్తే ఆ కుటుంబానికి అండగా ఉండేందుకు ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకాన్ని తీసుకొచ్చిందని రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. రామచంద్రపురం పట్టణంలోని 28వ వార్డుకు చెందిన మేడిశెట్టి శివన్నారాయణ ఇటీవల మరణించారు. వైఎస్సార్ బీమా పథకం నుంచి ఆయన భార్య నాగమణికి మంత్రి వేణు రూ.లక్ష సోమవారం అందించారు. స్థానిక కౌన్సిలర్ కుడిపూడి లలితా గణేష్, పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్, వార్డు సచివాలయ అడ్మిన్ పి.విక్రమ్, చల్లంగి సత్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.

శెట్టిబలిజ సంక్షేమ సంఘ కార్యవర్గం ఎన్నిక



శెట్టిబలిజ సామాజిక వర్గీయుల సమస్యలపై మాట్లాడుతున్న నాయకులు

కపిలేశ్వరపురం: మండల శెట్టిబలిజ సంక్షేమ సంఘం కార్యకవర్గం ఎన్నిక ఆదివారం రాత్రి వెదురుమూడి శెట్టిబలిజ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. అధ్యక్షుడిగా వాసంశెట్టి వాసు, ఉపాధ్యక్షుడిగా కొప్పిశెట్టి శ్రీనివాస్, కార్యదర్శిగా వనుం పార్థసారథి, కోశాధికారిగా శీలం రాంబాబు, గౌరవ అధ్యక్షుడిగా శీలం సత్యానారాయణ, పెంకే వెంకట్రావు, గుత్తుల పెద్దబ్బు, పితాని రామ చంద్రరావు ఎన్నికయ్యారు. సామాజికవర్గ అభ్యున్నతికి కృషి చేయాలంటూ సంఘ పెద్దలు శీలం గోవిందు, జిత్తుగ మల్లికార్జునుడు, మేడిశెట్టి దుర్గారావు, కాదా వెంకటరాంబాబు, చిట్టూరి నాగేంద్ర ప్రసాద్, మేడిశెట్టి గోవిందు, మట్టపర్తి పాల్ రాజ్ సూచించారు.

టిడ్కో ఫ్లాట్ల వద్ద వసతులు కల్పించాలి

మండపేట: టిడ్కో ఫ్లాట్ల వద్ద పూర్తిస్థాయిలో వసతుల కల్పనకు అధికారులు చర్యలు చేపట్టాలని మహాజన సోషలిస్ట్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దూలి జయరాజు కోరారు. లేదంటే ఈనెల 20న లబ్ధిదారులతో కలిసి మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ తాగునీరు, విద్యుత్, లీకేజీ సమస్యలతో లబ్ధిదారులు అవస్థలు పడాల్సి వస్తోందన్నారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

జీవో నంబర్-1ను రద్దు చేయాలి

కె.గంగవరం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవో నంబర్-1ను వెంటనే రద్దు చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కె.గంగవరం బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి అనంతరం తహసీల్దార్ వైద్యనాథశర్మకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో చీకట్ల వెంకటేశ్వరావు, వెంటపల్లి భీమశంకరం, రావి చినబాబు, ఖండవల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంకల్ప యాత్రలో ప్రతి అడుగూ ఒక సంక్షేమ పథకమే

కాజులూరు: నాడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజాసంకల్ప యాత్రలో వేసిన ప్రతి అడుగూ ఒక సంక్షేమ పథకమై నేడు నవరత్నాల పేరుతో ప్రజలకు సువర్ణ పాలన అందిస్తోందని వైఎస్సార్ సీపీ మండల బీసీ సెల్ కన్వీనర్ గుబ్బల ఏసురాజు అన్నారు. ప్రజాసంకల్ప యాత్రకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం గొల్లపాలెంలో సంబరాలు నిర్వహించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు జొన్నకూటి పద్మజ, వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ డైరెక్టర్ మాత బోస్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె సీమలు.. సంక్రాంతి కళకళలు

- పండగకు ముస్తాబవుతోన్న ఊర్లు
- బంధుమిత్రులతో ఇంటింటా సందడి



రాయవరంలో భోగిమంటలో భోగిపిడకలు వేస్తున్న చిన్నారులు

రాయవరం: హరిలో రంగ హరి అంటూ దీవించే హరిదాసుల కీర్తనలు.. అయ్యగారికి దండం పెట్టు.. అమ్మగారికి దండం పెట్టు అంటూ డూడూ బసవన్న దీవెనలు.. వింతైన శబ్దం చేస్తూ వేకువజామునే బుడబుక్కల వారి ఢమరుక నాదాలు.. చమత్కారాలతో చిందులేస్తూ.. చెట్లూ, పుట్టలు ఎక్కే కొమ్మదాసరులు.. లేనివి ఉన్నట్లు చెబుతూ బడాయిలు పోయే పిట్టల దొరల మాటలు.. సంక్రాంతి సందర్భంగా ప్రస్తుతం ఏ ఊరిలో చూసినా ఈ హడావిడే కనిపిస్తోంది. పెద్ద పండగగా పిలుచుకునే సంక్రాంతికి పల్లెసీమలు ముస్తాబవుతున్నాయి. బంధుమిత్రుల రాకతో ఇంటింటా సందడి నెలకొంది.

ఆ మర్యాదలే వేరు

సంక్రాంతి అంటేనే నూతన వస్త్రాలు ధరించడం, రకరకాల పిండి వంటలు వండుకోవడం ఆనవాయితీ. సంక్రాంతిలో ప్రధానంగా జిల్లాలో వండుకునే వంటల్లో అరిసెలు, పోకుండలు, సున్నుండలు, జంతికలు, కారబ్బూంది వంటి సంప్రదాయల వంటకాలను ప్రతి ఇంట్లోను వండుతారు. అచ్చమైన బెల్లంతో, స్వచ్ఛమైన నేతితో చేసే సున్నుండలది అగ్రస్థానమని చెప్పాలి. సంక్రాంతికి తూర్పులో కొత్త అల్లుళ్ల సందడి ప్రత్యేకంగా ఉంటుంది. కొత్త అల్లుళ్లకు సంక్రాంతి కానుకగా బహుమతులు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. ఎవరి స్థోమతను బట్టి వారు అల్లుళ్లను సంతృప్తి పర్చడం తరతరాలుగా వస్తోన్న ఆచారం.

భోగిమంటలకు ప్రాధాన్యం

పల్లెల్లో పిల్లలు ఆవుపేడతో చేసిన భోగి పిడకలను భోగి మంటలో వేస్తారు. భోగి పిడకలను దండగా గుచ్చి భోగిమంటలో వేయడం సంప్రదాయంగా వస్తోంది. ఇళ్లల్లోని పాత సామగ్రిని తెచ్చి ప్రధాన కూడలిలో భోగిరోజున పెద్ద మంటగా వేస్తారు. ప్రస్తుతం చాలా గ్రామాల్లో ముందస్తుగా సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తూ సందడి చేస్తున్నారు.



హరిదాసుకు బియ్యం ఇస్తున్న గృహిణి



అర్తమూరులో డూడూ బసవన్నల సందడి

ఊరూరా జాతరలే

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని 120 గ్రామాల్లో పండగ నాలుగు రోజులు ఎక్కడ చూసినా గ్రామదేవతలకు జాతరలు, తీర్థాలు నిర్వహిస్తారు.

ఆహార నియమాలపై అవగాహన అవసరం



అంగరలో గర్భిణిని పరీక్షిస్తున్న డాక్టర్ కన్యాకుమారి

కపిలేశ్వరపురం: ఆహార నియమాలపై గర్భిణులు, వారి సహాయకులకు అవగాహన అవసరమని అంగర పీహెచ్‌సీ డాక్టర్లు పి.రత్నకుమారి, జె.అనూజ ప్రియాంక అన్నారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం అంగర, వాకతిప్ప, అచ్యుతాపురం పీహెచ్‌సీల్లో వైద్య పరీక్షలు చేశారు. అంగరలో డాక్టర్ రత్నకుమారి, వాకతిప్ప పీహెచ్‌సీలో డాక్టర్ పి.చంద్రమౌళి, అచ్యుతాపురం పీహెచ్‌సీలో డాక్టర్ కె.శివరంజిని గర్భిణులను పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. గర్భిణులకు వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా రూ.5 వేలు నుంచి 10 వేల వరకూ ఆర్థిక సాయమందుతుందని చెప్పారు. వాటిని పొందేందుకు ఆధార్, బ్యాంక్ ఖాతా, ఆరోగ్య శ్రీ కార్డులను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పీహెచ్‌సీల ఎంపీహెచ్‌ఎస్‌లు ప్రకాశరావు, ఎస్.నూకరాజు, టి.మేరీమణి, పి.సురేష్, హెచ్‌ఈ బి.రామారావు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి



కోలంక వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు

కాజులూరు: ద్వారపూడి-యానాం రహదారిలో కోలంక వద్ద ఉన్న మలుపులో ప్రమాదాల్ని నివారించడానికి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. స్థానిక హైస్కూల్ సమీపంలో పాలమూరుపాడుకు వెళ్లే రహదారి వద్ద ఉన్న ఈ మలుపులో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ రహదారి ఇరుకుగా ఉండడంతో పాటు ఇరువైపులా విద్యుత్ స్తంభాలు ఉండడంతో వాహనాలు అదుపుతప్పి వాటిని ఢీకొడుతున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిని వెడల్పు చేయడంతో పాటు స్పీడు బ్రేకర్లు ఏర్పాటుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

గ్యాస్ లీకేజీతో మహిళకు గాయాలు

రాయవరం: గ్యాస్ లీకేజీ కారణంగా మంటలు చెలరేగి మహిళకు గాయాలైన ఘటన మండలంలోని మాచవరంలో చోటు చేసుకుంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాయవరం ఎస్‌ఐ పీవీవీఎస్‌ఎన్ సురేష్ సోమవారం విలేకరులకు తెలిపారు. గ్రామానికి చెందిన దోర లక్ష్మీకాంతం గ్యాస్ లీకై ఉండడాన్ని గమనించకుండా వేన్నీళ్లు కాచుకునేందుకు స్టౌ వెలిగించడంతో మంటలు వ్యాపించి ఆమెకు కాలిన గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు ఆమెను రాజమహేంద్రవరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

కృత్తివెంటికి ఘన నివాళి



కృత్తివెంటికి నివాళులర్పిస్తున్న మంత్రి వేణు, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్

రామచంద్రపురం: విద్యాదాత కృత్తివెంటి పేర్రాజు పంతులు జయంతిని పురస్కరించుకుని ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని కృత్తివెంటి విగ్రహానికి రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, మున్సిపల్ చైర్ పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రామచంద్రపురం పరిసర ప్రాంతాల ప్రజల విద్యాభివృద్ధికి కృత్తివెంటి చేసిన సేవలను వారు కొనియాడారు. వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు తొగరు మూర్తి ఆధ్వర్యంలో కృత్తివెంటి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్రీడా ప్రాంగణంలో మొక్కల ఆలనా పాలన చూస్తున్న రిటైర్డు కానిస్టేబుల్ నెట్టిమి లక్ష్మణరావును సత్కరించారు.

కార్యక్రమంలో ఆర్టోస్ డ్రింక్స్ ఎండీ అడ్డూరి సత్యనారాయణరాజు, వాకర్స్ క్లబ్ అసోసియేషన్ కార్యదర్శి పెంటపాటి అన్నవరం, సభ్యులు పొక్కులూరి శ్రీరామచంద్రమూర్తి, అంకం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదరికాన్ని జయించేందుకే నవరత్న పథకాలు

- మంత్రి చెల్లుబోయిన వేణు
- తాటిపల్లిలో గడపగడపకూ మన ప్రభుత్వం



తాటిపల్లిలో స్థానిక మహిళకు సంక్షేమ పథకాల్ని వివరిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: రాష్ట్రంలో పేదలు తమ పేదరికాన్ని జయించి తమ కుటుంబాన్ని ఆర్థికంగా ఉన్నత స్థితిలో నిలుపుకునేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాలు అమలు చేస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని తాటిపల్లిలో గ్రామ సర్పంచ్ పిల్లి అచల రాజశ్రీ, సొసైటీ చైర్మన్ పిల్లి బాలసుబ్రహ్మణ్యం దంపతులు, ఎంపీటీసీ రెడ్నం సతీష్‌లతో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి వేణు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి గత మూడున్నరేళ్లలో ప్రభుత్వం నుంచి ఆయా కుటుంబాలు అందిన లబ్ధిని వివరించారు. క్షేత్రస్థాయిలో సంక్షేమ పథకాలు అమలవుతున్న తీరుని అడిగి తెలుసుకున్నారు.

పేదలకు నాణ్యమైన జీవనం

పేదలకు నాణ్యమైన చదువు, నాణ్యమైన వైద్యం, నాణ్యమైన జీవనం అందించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దోహదం చేస్తున్నాయని మంత్రి చెల్లుబోయిన వేణు అన్నారు. ప్రభుత్వం నుంచి గ్రామస్తులకు అందిన సంక్షేమాన్ని వివరిస్తూ, సమస్యలను తెలియజేసిన వారికి పరిష్కారం నిమిత్తం అధికారులకు ఆదేశాలు ఇస్తూ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ కార్యదర్శి మాగాపు అమ్మిరాజు, గ్రామ పెద్దలు కుక్కల వీరన్న, కొప్పిశెట్టి శ్రీనివాస్, కుడుపూడి శ్రీను, పిల్లి గణేశ్వరరావు, సర్పంచ్‌లు పంపన వీరవెంకటరమణ, అనిశెట్టి రామకృష్ణ, వీరబోయిన సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో గర్భిణులకు వైద్య పరీక్షలు



గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్న యోగా గురువు ఫణికృష్ణారెడ్డి

రాయవరం: మండలంలోని రాయవరం, మాచవరం పీహెచ్‌సీల్లో సోమవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ పథకంలో భాగంగా పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎ.దేవిరాజశ్రీ, ఎం.శ్రీనివాస్, చంద్రికాకుమారిలు గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. రాయవరం పీహెచ్‌సీలో యోగా గురువు వెలగల ఫణికృష్ణారెడ్డి గర్భిణులకు సుఖ ప్రసవం అయ్యేందుకు యోగాసనాలపై అవగాహన కల్పించారు. అనంతరం రాయవరం పీహెచ్‌సీలో ఫణికృష్ణారెడ్డి సౌజన్యంతో 56 మందికి పౌష్టికాహారంగా ఖర్జూరం, బాదంపప్పు, జీడిపప్పు, వేరుశెనగ ఉండలు ఉచితంగా గర్భిణులకు అందజేశారు.

బీమా సొమ్ము అందజేత

ఆలమూరు: మండలంలోని చెముడులంకలో ఇటీవల మృతి చెందిన జల్లూరి జగ్గారావు కుటుంబానికి వైఎస్సార్ బీమా చెక్కు పంపిణీ జరిగింది. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద మృతుడు భార్య దుర్గకు నగదు రూపంలో సర్పంచ్ తమ్మన శ్రీనివాసు అందజేశారు. పేద కుటుంబాలకు వైఎస్సార్ బీమా ఎంతో ఆసరాగా ఉంటుందని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు దొండపాటి వెంకటేశ్వరరావు, దొండపాటి చంటి, మాజీ సర్పంచ్‌లు నాగిరెడ్డి సత్యానారాయణ, బుడ్డిగ వీర వెంకట్రావు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాల నివారణే లక్ష్యం

ఆలమూరు: మాతా శిశు మరణాల నివారణకు, చిన్నారులకు మెరుగైన ఆరోగ్య సంరక్షణను కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ (పీఎంఎంఎస్‌ఏ) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని చొప్పెల్ల, పెదపళ్ల వైద్యాధికారులు ఎం.సుమలత, ఆర్.సుదర్శన్‌బాబు, పి.భవానీశంకర్ అన్నారు. పీఎంఎంఎస్‌ఏ పథకంలో భాగంగా సోమవారం సుమారు 142 మంది బాలింతలు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న సేవలు, తీసుకోవలసిన జాగ్రత్తలను ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశ సిబ్బంది వివరించారు. ప్రతినెలా క్రమం తప్పకుండా 9వ తేదీన బాలింతలు, గర్భిణులకు నిర్వహిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు సూచించారు. సీహెచ్‌ఓ పి.వెంకటరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎస్.వెంకటేశ్వర్లు, పి.ఉమ, సీహెచ్ బేబి పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి



ఎమ్మెల్సీ తోటను సత్కరిస్తున్న మత్స్యకార మహిళలు

మండపేట: మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పేర్కొన్నారు. మండలంలోని ద్వారపూడికి చెందిన మత్స్యకారులు 70 ఏళ్లుగా రాజమహేంద్రవరంలో చేపల విక్రయాలు చేస్తున్నారు. రాజమహేంద్రవరం మత్స్యకారులు ఇటీవల అమ్మకాలకు అడ్డుచెప్పడంతో ద్వారపూడి మత్స్యకారులు ఎమ్మెల్సీ తోట దృష్టికి తీసుకు రాగా ఆయన చొరవ చూపి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. గ్రామంలో మత్స్యకార కమ్యూనిటీ హాలు కోసం 10 సెంట్ల స్థలం కేటాయింపునకు చర్యలు చేపట్టారు. తమ జీవనోపాధికి సంబంధించిన సమస్యను పరిష్కరించడంతో పాటు, కమ్యూనిటీహాలు నిర్మాణానికి కృషి చేస్తుండటంపై ఎమ్మెల్సీ తోటకు కృతజ్ఞతలు తెలుపుతూ సోమవారం మత్స్యకార సంఘం ఆధ్వర్యంలో మత్స్యకారులు, మత్స్యకార మహిళలు ద్వారపూడిలో ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు సంఘ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్సీ తోట చేసిన మేలును మరువలేమని, ఆయనకు ఎంతో రుణపడి ఉంటామన్నారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ మత్స్యకార కాలనీ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గజ్జి వెంకటరమణ, సర్పంచ్ ఈతకోట కిన్నెర, ఉప సర్పంచ్ తులా శేషారావు, సొసైటీ చైర్మన్ దంతులూరి శ్రీరామవర్మ, పార్టీ నేతలు తులా శ్రీరంగారావు, పోతుల రాంబాబు, చిక్కాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మాజీ ఎమ్మెల్యే పిల్లి అప్పారావుకు ఘన నివాళి



పామర్రులో పిల్లి అప్పారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ నాగమణి

రామచంద్రపురం రూరల్: మాజీ ఎమ్మెల్యే పిల్లి అప్పారావు 37వ వర్ధంతి పురస్కరించుకుని సోమవారం రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ వెంకటాయపాలెంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ బీసీల రాజ్యాధికారానికి పిల్లి అప్పారావు బాటలు వేశారన్నారు. ఆయన బాటలో మేడిశెట్టి వెంకట రామారావు, పిల్లి సుభాష్‌చంద్రబోస్, తాను ఈ నియోజకవర్గం నుంచి గెలిచామన్నారు. కార్యక్రమంలో పిల్లి అప్పారావు కుమారుడు శ్రీనివాస రామారావు, ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, గ్రామ సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ద్రాక్షారామలో పిల్లి అప్పారావు విగ్రహానికి రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్ తనయుడు సూర్యప్రకాశ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఇంత సంతోషంలు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

కె.గంగవరం: మండలంలోని పామర్రులో సోమవారం అప్పారావు 37వ వర్ధంతి వేడుకలను ఆయన కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. తొలుత స్థానికంగా ఉన్న అప్పారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ పంపన నాగమణి, ఇండస్ట్రియల్ కార్పొరేషన్ డైరెక్టర్ వాసంశెట్టి శ్యాం, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు బత్తుల అప్పారావు, పంపన సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కాజులూరు: కాజులూరు శివారు చాకిరేవుమెరకలో సోమవారం మాజీ ఎమ్మెల్యే పిల్లి అప్పారావు వర్ధంతి సందర్భంగా డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అమలాపురం పార్లమెంట్ శెట్టిబలిజ సంఘం కన్వీనర్ కడలి రాంపండు, వీరవల్లి గణపతి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై సభ్యుల మండిపాటు

- మండపేట మండల సర్వసభ్య సమావేశంలో చర్చ
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేద్దామన్న ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్



హౌసింగ్ ప్రగతిని వివరిస్తున్న ఏఈ దాసు

మండపేట: మండల సర్వసభ్య సమావేశానికి 34 శాఖల అధికారులు హాజరుకావాల్సి ఉండగా ఆర్ అండ్‌బీ, ఏఎంసీ, ఇరిగేషన్, దేవాదాయ, ఉద్యానవన, ఎక్సైజ్ తదితర పలు శాఖలకు చెందిన అధికారులు గైర్హాజరు కావడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండపేట మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. సమావేశానికి కీలక శాఖల అధికారులు డుమ్మా కొట్టడంపై సభ్యులంతా మండిపడ్డారు. వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు మాట్లాడుతూ మూడునెలలకోసారి నిర్వహించే మండల సమావేశానికి అధికారులు రాకపోవడం శోచనీయమన్నారు. ఎంపీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదుచేయాలని ఎంపీడీఓ ఐ.రాజును కోరారు. వేములపల్లి జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణ ప్రగతిని హౌసింగ్ ఏఈ దాసు వివరించారు. ఏడిద, పాలతోడు, మారేడుబాక సర్పంచులు బూరిగ ఆశీర్వాదం, పిల్లా వెంకటలక్ష్మి, మట్టపర్తి గోవిందరాజు, కేశవరం ఎంపీటీసీ సభ్యుడు అన్నందేవుల కృష్ణారావు తదితరులు గ్రామాల్లోని పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. మండలంలోని గ్రామాల్లో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైన్లు, శ్మశాన వాటికల అభివృద్ధి, కమ్యూనిటీహాళ్ల నిర్మాణం తదితర పనులకు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని, మండల ప్రత్యేకాధికారి ఓ.రామకృష్ణ, తహసీల్దార్ టి.రాజేశ్వరరావు, వైస్ ఎంపీపీ గజ్జి వెంకటరమణ, ఏఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పంట చేలో.. తెల్ల కలువల్లా



పంట చేలో ఆహారం కోసం బారులు తీరిన కొంగలు

రాయవరం: రబీ వరినాట్లు చివరి దశకు చేరుకుంటున్నాయి. వెదజల్లు వేసేందుకు సిద్ధం చేసుకున్న పంట చేలో ఆహారాన్వేషణలో భాగంగా పురుగులు తినేందుకు కొంగలు హల్‌చల్ చేస్తున్నాయి. రాయవరం-లొల్ల రహదారి పక్కన పురుగులు తినేందుకు వచ్చిన కొంగల సమూహం పంట చేలో తెల్లని కలువల్లా దర్శనమిచ్చిన దృశ్యం ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటుంది.

గర్భిణులకు పోషకాహార కిట్ల పంపిణీ

కొత్తపేట: గర్భిణులపై స్థానిక సత్యసాయి సేవా సంస్థ దృక్పథం అభినందనీయమని ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ పథకం కింద గర్భిణులకు ప్రతి నెలా తొమ్మిదో తేదీన వివిధ పరీక్షలు నిర్వహిస్తారు. దానిలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం సుమారు 60 మంది గర్భిణులకు వైద్యులు వివిధ పరీక్షలు నిర్వహించి, మందులు ఇవ్వడంతో పాటు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతి నెలా ఈ పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు స్థానిక సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కంకటాల సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో పోషకాహార కిట్లను పంపిణీ చేస్తారు. ఆ మేరకు ఎంపీపీ మార్గన గంగాధరరావు చేతుల మీదుగా సత్యసాయి సంస్థ సమకూర్చిన కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్ సీపీ నాయకుడు బందారు కృష్ణమూర్తి, వైద్యాధికారి మధుకర్, సేవా సమితి సభ్యులు మారిశెట్టి సత్యనారాయణ, చింతం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.